క్లుప్తంగా

ఉచిత కంటి వైద్యశిబిరం



సిరిసిల్ల: శ్రీ వర్ష కంటి దవాఖాన ఆధ్వర్యంలో పట్టణంలోని బీవైనగర్, ఇందిరానగర్, గణేశ్‌నగర్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సీమ బేగం, నాయకులు గోసిక అనిల్‌కుమార్, బేతి కరుణాకర్, వంగ కుమార్, నక్క భూపతి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చీర్లవంచలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉచిత పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మనువాడ శంకర్, విజయ్ కుమార్, నరసింహారెడ్డి, రాములు, వెంకటేశం, తదితరులు ఉన్నారు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి బస్టాండ్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 153 మందికి వైద్య పరీక్షలు చేశారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వివిధ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ నాయిని భాస్కర్‌రెడ్డి, సభ్యులు పయ్యావుల రామచంద్రం, ముత్యాల శ్రీనివాస్ రెడ్డి, బోయిని మహదేవ్, పాటి దేవయ్య, పెంజర్ల దేవయ్య, లక్ష్మణ్, రవి, దేవేందర్ రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు పోటీలు

సిరిసిల్లటౌన్: అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాల సందర్భంగా సోమవారం ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శ్రీ సత్యసాయి సేవా మందిర ప్రాంగణంలో నిర్వహించనున్నారన్నారు. చెస్, క్యారం, రింగు, మెమోరీపవర్‌పై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

అగ్ని ప్రమాదాల నుంచి వన్యప్రాణులను కాపాడుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోనరావుపేట: అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలని, వన్యప్రాణులను కాపాడాలని రేంజ్ అధికారి ఖలీలొద్దీన్ కోరారు. మండలంలోని ఎగ్లాస్‌పూర్‌లో వన్యప్రాణుల సంరక్షణ, అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు లేకుంటే మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. అందువల్ల అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారులు పల్లె శ్రీనివాస్, బీట్ అధికారులు సుదర్శన్, అభిషేక్‌రావు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ



ఇల్లంతకుంట: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పాత్తూరులో ఆదివారం దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పాత్తూరు కురుమ సంఘ నాయకులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, హైదరాబాద్ డీసీపీ రాహుల్ హెగ్డేను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘ అధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, పోలె శ్రీనివాస్, తుల ఉమ, మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య యాదవ్, పర్స ఐలయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి పలుగ్రామాల కురుమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రేపు చెక్కుల పంపిణీ

సిరిసిల్లకల్చరల్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఈనెల 3న సఖికేంద్రం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల చేతులమీదుగా 12.5 లక్షల విలువైన చెక్కులు, మ్యారేజ్ ఇన్సెంటివ్ ప్రొసీడింగ్స్‌తో పాటు దివ్యాంగుల ఉపకరణాలను పంపిణీ చేయనున్నారన్నారు. దివ్యాంగులకు నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం, ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్య పరిరక్షణ కోసం హైదరాబాద్‌లో సీఎం ప్రారంభిస్తున్న మైత్రిక్లినిక్ విభాగాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి కేటాయించినట్లు పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని నేరెళ్లలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కోల శంకర్ ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బోయిని పోచవ్వకు రూ.20 వేల చెక్కు అందించారు. కాంగ్రెస్ నాయకులు కోల ఆనంద్, లక్ష్మణ్, వంగపెల్లి పర్శరాములు, శ్రీకాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..

మండలంలోని బండపల్లి గ్రామ శివారు వద్ద లో లెవల్ కల్వర్టు వద్ద ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు మూడెనెలల క్రితం భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. రోజు వందలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతాయి. రాత్రిపూట దగ్గరకు వచ్చేంత వరకు రోడ్డు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. – చందుర్తి



జనావాసాల మధ్య మురుగు

జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి డాక్టర్స్ స్ట్రీట్‌కు వెళ్లేదారిలో ఆటోస్టాండ్ వద్ద మురుగు సమస్యతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. వర్షం పడినప్పుడు వరదనీరే కాకుండా అక్కడి బార్ అండ్ రెస్టారెంట్ నుంచి వచ్చే మురుగు ఇలా రోడ్డుపై చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇక్కట్లు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – సిరిసిల్ల

కార్తీక వన భోజనాలు



తంగళ్లపల్లి : పూజలు చేస్తున్న మహిళలు

సిరిసిల్లటౌన్: పద్మనాయక వెలమ సంక్షేమ మండల ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన భోజనాల వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. సుమారు 300 మంది అంకిరెడ్డిపల్లిలోని సురభి సత్యనారాయణరావుకు చెందిన మామిడితోటలో తులసి, ఉసిరి చెట్టు పూజ, గోపూజ చేసి విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. మహిళల ఆటా పాటలు.. నృత్యాలు చేశారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల రామారావు వేణుగోపాల్ రావు, బొంత వేణుగోపాల్ రావు, సురభి దశరథ్‌రావు, మట్టపల్లి భూపతిరావు, కారంగుల వెంకటరావు, సురభి సత్యనారాయణ రావు, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: అంకిరెడ్డిపల్లెలో ఆదివారం వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో కార్తీక వన భోజన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తి శ్రద్ధలతో ఉసిరిచెట్టు పూజ, గోపూజ నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రముఖ సీనియర్ న్యాయవాది సురభి సత్యనారాయణ రావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో వెలమ సంక్షేమ మండలి అధ్యక్షుడు సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, వెలమ సంక్షేమ మండలి ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ రావు, ఉపాధ్యక్షుడు దశరథ రావు, చీటి నర్సింగ రావు, మేఘమాల, కోశాధికారి వేణుగోపాలరావు, సంయుక్త కార్యదర్శులు అనిల్ కుమార్, సభ్యులు వెంకట్రావు, ప్రదీప్‌రావు, వెలమ కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరినవారితో ఆది శ్రీనివాస్

వేములవాడ: రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేందుకు కలిసి రావాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ కోరారు. బీఆర్ఎస్ వేములవాడ రూరల్ మండల ఎస్సీసెల్ అధ్యక్షులు ఎడపల్లి విష్ణుతోపాటు చెక్కపల్లి, బొల్లారం గ్రామాలకు బీఆర్ఎస్ నాయకులకు ఆదివారం రాత్రి తన నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, డీసీసీ ఉపాధ్యక్షుడు సంగ స్వామి, రూరల్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, నాయకులు కరుణాకర్, ప్రవీణ్, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దత్త జయంత్యుత్సవాలకు రావాలి

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లిలో ఈనెల 14 నుంచి 16వ వరకు దత్తాత్రేయస్వామి ఆలయంలో జరిగే దత్త జయంత్యుత్సవాలకు హాజరుకావాలని గ్రామానికి చెందిన పలువురు ఆదివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి ఆహ్వానించారు. గొట్ల వెంకటేశం, ఆడెపు రాజు, మందాల వరుణ్ తదితరులు ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలిన మాల మహానాడు నాయకులు



చందుర్తి నుంచి సభకు తరలుతున్న మాల మహానాడు నాయకులు



ఎల్లారెడ్డిపేట నుంచి తరలుతున్న నాయకులు

ముస్తాబాద్: మాలల సింహగర్జనకు మండలం నుంచి పెద్దఎత్తున హైదరాబాద్‌కు ఆదివారం తరలివెళ్లినట్లు మాల మహానాడు మండల అధ్యక్షుడు జంగ భూమరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం జరుగుతుందని, విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కోల్పోతారన్నారు. హైదరాబాద్‌కు తరలివెళ్లిన వారిలో జక్కుల యాదగిరి, బత్తుల భాస్కర్, కృష్ణ, క్రాంతికుమార్, తదితరులున్నారు.

చందుర్తి: మాలల సింహగర్జన సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి మాల మహానాడు నాయకులు తరలివెళ్లారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే సభకు మండలం నుంచి సుమారు 1200 మంది వరకు తరలివెళ్లినట్లు మాల మహానాడు నాయకులు కమలాకర్ తెలిపారు.

ఇల్లంతకుంట: మండలంలో మాల మహానాడు సభ్యులు ర్యాలీ తీశారు. అనంతరం మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం హైదరాబాద్‌లో జరిగే మాల సింహగర్జనకు తరలివెళ్లారు. పలు గ్రామాల మాలమహానాడు సభ్యులు 200 మంది వరకు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు గ్రామాల నుంచి హైదరాబాద్‌లో జరిగే మాలల సింహ గర్జనకు మాలలు పెద్దఎత్తున తరలివెళ్లారు. నాయకులు ఎడ్ల సందీప్, ఎడ్ల రాజ్‌కుమార్, ఎడ్ల లక్ష్మణ్, కొత్త బాబు, ఆనందం, నవీన్, రాజు తదితరులున్నారు.

4న ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు

సిరిసిల్లకల్చరల్: ప్రజాపాలన విజయోత్సవ సంబరాల్లో భాగంగా ఈనెల 4న జిల్లాకేంద్రంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సంగీత నాటక అకాడమి చైర్‌పర్సన్ ప్రొఫెసర్ అలేఖ్య పుంజుల మార్గ దర్శకాల మేరకు కొత్త బస్టాండ్‌లోని సినారె కళామందిరంలో వైవిధ్యమైన సాంస్కృతిక రూపాల ప్రదర్శన ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటలకు కళారూపాల ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సిబ్బంది విద్యార్థులు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరుకావాలన్నారు.

రాజవ్వకు మెరుగైన వైద్యం



రాజవ్వను ఇంట్లో చేర్చి కౌన్సెలింగ్ ఇస్తున్న డీడబ్ల్యూవో లక్ష్మీరాజం

సిరిసిల్లకల్చరల్: అయినవాళ్లే కాదనుకొని, బతికుండగానే శ్మశానంలో వదిలివేయడంతో ఓ వృద్ధురాలిని జిల్లా శిశు, మహిళా సంక్షేమ శాఖ చేరదీసింది. తంగళ్లపల్లి మండలకేంద్రానికి చెందిన పారిశుధ్య కార్మికురాలు కూకట్ల రాజవ్వ (75)కు భర్త లేకపోవడంతో తన అన్న ఇంట్లో ఉంటోంది. కొంతకాలంగా అనారోగ్యంతో మంచంపట్టింది. ఆమెకు వైద్యం, అవసరమైన సపర్యలు చేయలేక మేనల్లుడు తిరుపతి బతికుండగానే శ్మశానంలో వదిలేశాడని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. తిరుపతిని ఆరా తీస్తే రాజవ్వ సోదరి పిల్లలు చూసుకుంటామని తీసుకెళ్లారని చెప్పారు. స్పందించిన జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారులు సదరు వృద్ధురాలిని శ్మశానం నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. సుమారు పదిరోజుల పాటు మెరుగైన వైద్యం అందించి వృద్ధురాలిని ఆదివారం సిరిసిల్లకు తీసుకొవచ్చారు. జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం సిబ్బందితో వృద్ధురాలిని ఆమె కుటుంబ సభ్యులవద్దకు చేర్చి కౌన్సెలింగ్ ఇచ్చారు.

కార్మికుల పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయాలి



బోయినపల్లి: మాట్లాడుతున్న రాములు, తదితరులు

బోయినపల్లి: ప్రభుత్వం కార్మికుల పెండింగ్ ఫైల్స్ వెంటనే క్లియర్ చేయడంతో పాటు, థంబ్ సిస్టం రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కడారి రాములు పేర్కొన్నారు. కొదురుపాకలో ఆదివారం కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ టెస్టుల పేరుతో కార్మిక సంక్షేమ నిధుల నుంచి కోట్ల రూపాయలు వాడుకుంటున్నారన్నారు. ఈ పథకం రద్దు చేసి సంక్షేమ నిధిలో ఉన్న డబ్బులను కార్మికుల సంక్షేమానికి అందేలా చూడాలన్నారు. 55 ఏళ్లు నిండిన కార్మికులకు రూ. 5వేలు పింఛన్ ఇవ్వాలని, బీమా సౌకర్యం పెంచాలన్నారు. ఆయన వెంట పలువురు కార్మికులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రోడ్డు ప్రమాదాల నివారణకు సిరిసిల్ల– కామారెడ్డి ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ తెలిపారు. రోడ్లపై స్పీడ్ బ్రేకర్లను ఆదివారం వారు పరిశీలించారు. వర్తక, వ్యాపారుల సహకారంతో రాచర్లబొప్పాపూర్ నుంచి వెంకటాపూర్ గ్రామాల మధ్యలో జరిగే ప్రమాద స్థలంలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వర్తక, వ్యాపారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

● ఓపెన్ యూనివర్సిటీ తరగతులు ప్రారంభం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ తరగతులు ప్రారంభించినట్లు స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ ప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు ప్రతి ఆదివారం తరగతులు నిర్వహిస్తున్నమని విద్యార్థులు హాజరై వినియోగించుకోవాలన్నారు.

● జీవో 317 బాధితులకు న్యాయం చేయాలి

సిరిసిల్లటౌన్: జీవో 317లోని నిబంధనలకు అనుగుణంగా ఉన్న భార్యాభర్తలు, ప్రాధాన్యత కేటగిరీలు, పరస్పర బదిలీలు మాత్రమే చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. జీవో 317లోని అసంబద్ధమైన నిబంధనల కారణంగా నష్టపోతున్న వారికి న్యాయం చేయాలని కోరారు. దంపతుల బదిలీలు గత ప్రభుత్వంలో 19 జిల్లాల్లో పూర్తిగా, 13 జిల్లాల్లో స్కూలు అసిస్టెంట్ స్థాయి వరకు బదిలీలు నిర్వహించారన్నారు. జీవో 317 బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం సర్దుబాటు చర్యలు వెంటనే చేపట్టాలని కోరారు.

● నేడు విధుల బహిష్కరణ

తంగళ్లపల్లి: సిరిసిల్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించనున్నారని, కక్షిదారులు సహకరించాలని అధ్యక్షుడు దొర్నాల సంజీవరెడ్డి, జనరల్ సెక్రటరీ టి.వెంకటి తెలిపారు. వేములవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది నక్క దివాకర్‌పై బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తూ కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. న్యాయవాదులపై పెరుగుతున్న అకృత్యాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

● దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలకు మొత్తం 101 కంప్యూటర్లు మంజూరైనట్లు ఎంఈవో మురళీనాయక్ తెలిపారు. ఒక్కో కంప్యూటర్ విలువ సుమారు రూ. 20 వేలుండగా వాటిని ఇన్‌స్టాలేషన్ చేసి బిగించేందుకు అర్హులైన ఏజెన్సీ నుంచి ఓపెన్ టెండరు వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన ఏజెన్సీ నిర్వాహకులు ఈనెల 2 నుంచి 6న సాయంత్రం 5 గంటల్లోపు కోనరావుపేట ఎమ్మార్సీలో అందజేయాలని కోరారు.

● నేడు ఆర్ఆర్ఈ సొసైటీ ఎన్నికలు

సిరిసిల్లటౌన్: రాజరాజేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ ఎన్నికలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ల జగన్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతనగర్‌లోని సొసైటీ ఎలక్షన్స్ ఉదయం 10 నుంచి 1.30గంటల్లోపు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికల అధికారిగా ఆకునూరి సురేశ్ ప్రసాద్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

● సన్మానం

వేములవాడ: వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కనికరపు రాకేశ్‌ను పట్టణ మేదరి సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కనికరపు దేవయ్య, ప్రధాన కార్యదర్శి కనికరపు వెంకటేశం, ఉపాధ్యక్షులు కనికరపు అరవింద్, కోశాధికారి కనికరపు తిరుపతి, ప్రచార కార్యదర్శి కనికరపు అనిల్, కనికరపు రాజనర్సు, కనికరపు రాజయ్య, గుల్ల రాజయ్య, లచ్చయ్య, రవి, కనికరపు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

● సమస్యలు పరిష్కరించాలి

బోయినపల్లి: ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ భవన నిర్మాణ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గురజాల శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని విలాసాగర్‌లో కార్మికులతో కలిసి మాట్లాడారు. కార్మికుల పిల్లల వివాహాలకు రూ.లక్ష ఇవ్వాలని, అలాగే ప్రసవాలకు రూ.లక్ష ఇవ్వాలని కోరారు. సాధారణంగా, ప్రమాదవశాత్తు కార్మికులు చనిపోతే ఇచ్చే పరిహారాలు పెంచాలని పేర్కొన్నారు. భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు మల్లేశం, బొడ్డు శంకర్, సుంకపాక దేవయ్య, విక్రమ్, దూమాల రమేశ్, గజ్జెల రాజు తదితరులు ఉన్నారు.

● పేకారాయుళ్ల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై రమాకాంత్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలోని ఓ ఇంట్లో కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేసినట్లు తెలిపారు. 8 మందిని అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ.9,400 నగదు, 8 సెల్‌ఫోన్లు, 5 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.



వేములవాడరూరల్: గ్రామాల్లో లూజ్‌వైర్లను సరిచేయాలని మండల సమావేశాల్లో ప్రజాప్రతినిధులు చెప్పినా చాలా గ్రామాల్లో అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల శివారు వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయి. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ఆ ప్రాంత రైతులు భయాందోళన చెందుతున్నారు. వెంటనే లూజ్‌వైర్లను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని వారు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : రాకేశ్‌రెడ్డి, సెస్ ఏఈ, వేములవాడరూరల్ సెల్: 9440814073

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు



వేములవాడ రూరల్ : పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



వీర్నపల్లి: పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సిరిసిల్లటౌన్: ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల మండలస్థాయి వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు ఆదివారం నిర్వహించారు. జెడ్పీహెచ్ఎస్ వెంకంపేట పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో దూస రఘుపతి మాట్లాడారు. మండల స్థాయిలో అన్ని పాఠశాలల నుంచి దాదాపు 85 మంది చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయ బృందం పాముల దేవయ్య, గుండెల్లి రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా వేములవాడ అర్బన్ మండల స్థాయి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. మండల విద్యాధికారి బన్నాజీ, ఉపాధ్యాయులు రాజారత్నం, కృష్ణ, హరికృష్ణ, రవీందర్, హమీద్, రాధిక, సీఆర్పీలు తదితరులు ఉన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి, ఫాజుల్‌నగర్, మర్రిపల్లి, హన్మాజీపేట, బాలరాజుపల్లిలో మండలస్థాయి వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీల్లో 120 మంది విద్యార్థులు పాల్గొనగా వ్యాసరచనలో గ్రీష్మ, తపస్వి, సుప్రియ గెలుపొందగా, చిత్రలేఖనంలో నైమిశా, చందన, శ్రీవల్లి గెలుపొందారు. ఎంఈవో కిషన్, ఉపాధ్యాయులు రేగుల శ్రీనివాస్, శ్రీనివాస్, మహేష్, సంతోష్, రమేశ్, జీవన్, సురేశ్ పాక రవి, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

చందుర్తి: ప్రజాపాలన, ప్రజావిజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా చందుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో కేజీబీవీ పాఠశాలకు చెందిన విదాత్రకు ప్రథమ, ఎన్గల్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి హర్షితకు ద్వితీయ, నర్సింగాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని బి.మమతకు తృతీయ బహుమతిని అందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వినయ్‌కుమార్, పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు మహేశ్, కాపిల్ల నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఉన్నత ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఎంఈవో కృష్ణహరి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన పి.రిషిక, పి.ప్రణవి, ఎ.మధుశాలిని, బి.సాయికృప, ఎ.నిహారిక, బి.అరుణ నిలిచారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

బోయినపల్లి: ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్ విద్యార్థులకు ఆదివారం మండలస్థాయి డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 25మంది విద్యార్థులు పాల్గొన్నారు. డ్రాయింగ్ పోటీల్లో ఎం.నవిత, ఎన్.ప్రవళిక, వ్యాసరచన పోటీల్లో కే.భానుచరణ్, కే.లాస్య, జి.మన్విత, బి.వైష్ణవి, పి హారిక, ఎం.నవీన విజేతలుగా నిలిచారు. ఎంఈవో ఎస్. శ్రవణ్‌కుమార్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఏ. రఘునాథ్, కేజీబీవీ ఎస్‌వో ఎం.లింగవ్వ, ఉపాధ్యాయులు ఉన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'మన వంటగది మన బాధ్యత'



వంటల పోటీల్లో విజేతలతో జిందం కళ

సిరిసిల్లటౌన్: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 'మన వంటగది మన బాధ్యత' వంటల పోటీల కార్యక్రమం ఆకట్టుకుంది. వందలాది సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ..ప్రజలందరి బాగోగులు చూసేది దేవుడైతే ఇంట్లో కుటుంబ సభ్యుల బాగోగులు చూసేది మహిళలే అన్నారు. ప్రతి మహిళ చేసే ఇష్టమైన పని వంట చేయడం వంటశాల ఒక దేవాలయం లాంటిదన్నారు. వంటగ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిర్వాహకులు మహిళలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ దుబ్బాక లావణ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ మేజర్ లత, సిరిసిల్ల పట్టణంలోని వివిధ ఎల్పీజీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీల నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.

గురుకులాల పరిశీలన



మాట్లాడుతున్న శ్రీకాంత్ గౌడ్

వేములవాడఅర్బన్: పట్టణంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలలను బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి వెంగళ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ గురుకులాల్లో సరైన నీటి వసతి లేదన్నారు. కనీసం విద్యార్థుల పరిస్థితులను తెలుసుకునేందుకు వచ్చిన ఆంక్షల పేరుతో అధికారులు కళాశాలల్లోకి అనుమతించకపోవడమే, 10 నెలల్లో ప్రభుత్వ తీరుకు నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో గురుకులల్లో ఎలాంటి సమస్య తలెత్తకుండా చూశామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు పోతు అనిల్, ప్రేమ్‌చారి, పర్వేజ్, సందీప్, వెంకసాయి,దిలీప్, అరుణ్, శంకర్ తదితరులు ఉన్నారు.

● ఆర్థికసాయం అందజేత

సిరిసిల్లటౌన్: సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (స్వా) ఆధ్వర్యంలో సిరిసిల్లకు చెందిన వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ఆర్థికసాయం అందించారు. అలేఖ్య, శివాని, అంచల్, వైష్ణవి రూ. 5వేల చొప్పున రూ. 20వేలు సంస్థ ద్వారా అందించారు.